కామిశెట్టి శివప్రసాద్



'ఇలా జరుగుతుందనుకోలేదు' అంది పార్వతి, వెక్కిళ్లను దిగ్రమింగు కొంటూ. కను కొలకుల్లోని నీటి బిందువులు పార్కు లైట్ కాంతిలో అస్పష్టంగా మెరిశాయి.

మోకాళ్లమీద గడ్డాన్నానించి, చీర కుచ్చిళ్లలో పాదాలను కప్పుకొంటూ తప్త హృదయంతో కూర్చున్న పార్వతి ముఖం లోకి, చలపతి నిముషంసేపు నిర్వికారంగా చూసాడు.

కుదురయిన ఫాలభాగం, గాలికి అస్తవ్యస్తంగా చెదిరిన ముంగురులు, నిద్రలేమి తోనూ, దుఃఖభారంతోనూ అలసిన కను రెప్పలు వాచి, కొద్దిగా [illegible] గుండ్రటికళ్లు, తీర్చిదిద్దిన సన్నటి నాసిక, గులాబీరంగు పలుచటి అధరాలు, మునితేలిన గడ్డం—కలిపి మొత్తంగా చూస్తే కోం ముఖం.

'నేను త్రోసి పుచ్చుతున్నకొద్దీ అమ్మకు

నా ప్రవర్తనవల్ల అమాయకత్వం, తనవాటు పెద్దాలన్న పంతం, పట్టుదలా—చివరకు నన్నుకూడా వొప్పించి యీ పరిస్థితికి తీసుకొచ్చింది. ఇంకేం చేయను, మీకు రాసాను...'

గడ్డిపోచల్ని వొక్కొక్కటినీ త్రుంచి కున్నగా వస్తూ తగ్గుస్వరంతో అంది పార్వతి.

చలపతి యేం మాట్లాడలేదు—

పార్కు పూలమొక్కల్లోనుంచి చల్లటి గాలి, మసక చీకటిని పూర్తిగా మింగివేయ చూస్తున్న ఎలక్ట్రిక్ దీపాలు, సిమెంటు పోసిన జర్మన్ సిల్వర్‌గిన్నెను తలగడగా పెట్టుకొని నిద్రపోతున్న ముసిలివాడు, రేపటి జీవితాన్ని సుందరంగా కలగంటూ ముఖాన చిర్నవ్వు, ఆ నవ్వుని కప్పివేస్తున్న మాసినగడ్డం; ప్రక్కనే నిద్ర గన్నేరు చెట్టు, అప్పుడే జేబురుమాళ్ళు పరుచుకొని కూర్చుంటున్న యిద్దరు కుర్రాళ్ళు. మల్లె పువ్వుల్లాంటి వాళ్ళదుస్తులు; చేతుల్లో పుస్తకాల్ని దూరంగా విసరి వొకొర్నొకరు చూసుకొని నవ్వుకుంటున్నారు. వాళ్ళకు కొంచెం దూరంలో ముద్ద మందార చెట్టు గాలికి తలూపుతుంది.

పరిసరాల్నిచూస్తూ మౌనంగా వుండిపోయాడు చలపతి.

'సరిగ్గా నాలుగురోజుల్లో నామెడకు ఉరిత్రాడు బిగుసుకోంటుంది. మీరు... మీరేం చెయ్యలేరూ?...' రక్తంతో తడిసి, గుండెల్ని చీల్చివేస్తున్నబాధ కంఠంలో మిళితమయి, వణికి, బొంగురుపోయిన గొంతుతో ఉద్విగ్నంగా అడిగింది పార్వతి.

క్షణంసేపు తొట్రుపడ్డాడు చలపతి— ముఖం వివర్ణమయింది.

శరీరంలో రక్తం వేగంగా ప్రవహించినట్లయింది.

ఆక్షణం, ఆతొట్రుపాటు, ఆశించని మాటప్రశ్న, జవాబుగా గుండెలు కొట్టుకోవడం, ఆక్షణం తరువాత విస్మయంగా ప్రేమగా పార్వతి ముఖంలోకి చూడటం— ఆమొత్తం అతని పాతికేళ్ళ జీవితానికి క్రొత్త అనుభవమనిపించింది.

తలపైకెత్తి, గడ్డం నిమురుకొంటూ ఆకాశంలోకి చూసాడు చలపతి.

ముక్కలు ముక్కలుగా తెగిపోయిన నీలాకాశాన్ని అక్కడక్కడా అంటి పెట్టుకొన్న తెల్లటి మేఘాలు; వుండి వుండి బలహీనంగా వెలిగి మాయమవుతున్న నక్షత్రాలు; కరెంటు తీగలకు కొంచెం యెత్తులో గుర్తుతెలియని పిట్టేదో అదేపనిగా అరుస్తుంది. కొంచెం సేపటికి దానిరెక్కలు తెగిపోయి క్రిందపడి పోతుందేమో ననిపించింది చలపతికి.

ఆ ఆలోచన కలిగిన లిప్తకాలం అతని ముఖాన పేలవమయిన చిర్నవ్వు చోటు చేసుకొంది.

మస్తిష్కంలో ఆలోచనలు రూపాన్ని దిద్దుకొంటున్నాయి.

మనిషి జీవించడానికి కొంత సుఖమూ, సంతృప్తి యెంత అవసరమో మానవత నుంచి విడివడకుండా వుండేందుకు కొంత త్యాగం, ఆత్మవున్నత్యంకూడా అంతే అవసరం. అప్పుడే జీవితానికి విలువ, మనిషి ఉనికికి అర్థం యేర్పడతాయి.

జీవితంలో అందివచ్చిన ఎనేకానేక అనుభవాల్నుండి, ఆవేదనలనుండి, అంతర సంక్షోభాలనుండి చెదరక, ఓడిపోక, నిగ్గెత్తుక తను నేర్చుకొన్న జ్ఞానం, నిలుపుకొన్న విశ్వాసం అదీ జీవితంమీద.

'ప్రేమ'కీ, జీవితానికీ నిర్వచనాలు చెప్పడమంత అర్థరహితమయిన పని మరొకటి వుండబోదు. అయితే ఎవరికి వారికి వ్యక్తిగతమయిన అభిప్రాయాలూ, ఆలోచనలూ వుంటూనే వుంటాయి.

ప్రేమంటే తన దృష్టిలో అర్థం యిద్దరి వ్యక్తుల స్వార్థం అని. ఇద్దరు వ్యక్తులు పరస్పరంగా మానసిక, శారీరక సుఖసంతోషాలను పొందగోరడమే ప్రేమించడం. అంతకుమించి మరేదో అద్భుతమయిన విలువల్ని సృష్టించి, జీవితం అందుకే అంటే తనంగీకరించలేడు. అదిగో సృష్టి అబద్ధాన్ని పనిగట్టుకొని ప్రచారంచేసే వెర్రితనం అనిపిస్తుంది. అంతమాత్రంచేత యిద్దరి వ్యక్తుల ఆ ఆకర్షణా బంధాన్ని పూర్తిగా తప్పనుకోవడంకానీ, అనవసరం కానీ అనుకోవడం తప్పు. బ్రతకడంకోసం మనిషి గాలి పీల్చుకొంటున్నంత సహజంగా అది రైటు. కాలగమనంతోపాటు ప్రకృతి మనిషికి కొన్ని శారీరకమయిన మార్పుల్ని తెస్తుంది. తను కోరుకొని, ఒకోసారి కోరుకోకుండానే అంతర్లోకాన్ని కొన్ని భావనలకు, ఆనందాలకు నిలయంగా మార్చుకొంటాడు మనిషి.

తన విషయంలోనూ అంతే.

జీవితంలోని ఒకానొక విచిత్రమయిన మలుపులో అనుకోకుండా, యాదృచ్ఛికంగా తటస్థపడ్డ వ్యక్తి పార్వతి.

చాలా కొద్దికాలంలోనే అతి సన్నిహితురాలైంది.

తనున్న మానసికస్థితికి ఆ సమయంలో ఆసరా, ఓదార్పు, తోడు ఏమయితే అవసరమయ్యాయో అవన్నీ ఆమెద్వారా లభించి తను ఆత్మవిశ్వాసంతో విశ్వసించడానికి దోహదురాలయింది పార్వతి.

పార్వతిని తను ప్రేమించాడు.

ఒకవిధంగా ఆలోచిస్తే జీవితాన్నే ఆమెద్వారా ప్రేమించాడు.

ఆశకూ, ఆలోచనకూ ఆలంబనం పార్వతి.

విశ్వాసానికీ, ఆచరణకి మూలం పార్వతి.

అలా జీవించాడు తను ఆరోజుల్లో—

భవిష్యత్ జీవితాన్ని సుందరంగా కలగంటూ కాలాన్ని తేలిగ్గా వెనక్కు నెట్టేసాడు తను.

కానీ— పరిస్థితి తారుమారయింది. ఆశించని ఆలోచించని విషమ స్థితి సునాయాసంగా మీదపడింది.

ఆ రోజు—

తన ఆలోచనలు, అభిప్రాయాలూ— పరిస్థితులు అన్నీ తెలిసిన పార్వతి, పంతబాగా తనంత కృతజ్ఞురాలయివుంది, కుటుంబంలోని బంధాలు తన్నెలా చుట్టుముట్టి ప్రతిబంధకాలను వివరంగా రాసిన ఉత్తరాన్ని చదువుకొన్న పార్వతి, తన ఆలోచనలకు ఆచరణలో యెంత విలువిస్తాడో అర్థం చేసుకోగలిగి, ఒకప్పుడు తనకు సహాయమిచ్చిన పార్వతి, యీ విశాల ప్రపంచంలో తన ఆత్మకు అద్దం పట్టగలిగే ఒకే ఒక వ్యక్తి పార్వతి! —

'మీరేం చెయ్యలేరూ?' అని ప్రశ్నించింది సవాలు విసిరింది.

ఏం చెప్పడం? యెలా చెప్పడం?

తను చెయ్యగలిగింది, చేస్తుంది న్యాయమని ఘోషిస్తున్న తన అంతరాత్మను ప్రశ్నించడం యెలా?

'ప్రేమ' అనే మధురభావానికీ, దాని నుంచి ఆశించిన భవిష్యత్ జీవితానికి— అంటిపెట్టిన ఊహలకి ఆనందంతో తను కట్టిన రెక్కల్ని తనే యెందుకు త్రుంచ

తున్నాడో సహేతుకంగా వివరించి చెప్పడం యెలా? యెట్నుంచి?

అక్కడ ఆగిపోయాడు చలపతి—

చలపతి ఆలోచనలు అక్కడ ఆగిపోయాయి.

ఆ అనంతాకాశంలో యింకా చిన్న ప్రశ్నకు సమాధానం దొరకక, వూపిరాడక మాటలు తోచక—తల ప్రక్కకు త్రిప్పి విచ్ఛిన్నంగా పార్వతివైపు చూసాడు.

ఆమె సజల నయనాలు ఆవేదనతోనూ, ఆర్ద్రతతోనూ అతన్నే చూస్తున్నాయి.

'చూడు పార్వతీ!...' చాలా సౌమ్యంగా, శాంతంగా మాట్లాడాలని చలపతి ప్రయత్నం.

కాని, కంఠంలో జీర పలికింది. సర్దుకొన్నాడు.

'నీ మనసుని నొప్పిస్తున్నందుకు మన్నించు...' గొంతు సహజంగా వుంది.

'జీవితంలో నేనాశించని, ఊహించని ఒక కఠినమయిన పరిస్థితిని యివాళ నువ్వు ప్రశ్నించినంత ధైర్యంగా నేనూ యెదుర్కోవాలి. ఆ గుమ్మంలో తిరిగి యేనాడయినా కాలుపెడతానని కానీ, పంకజం నాకింత సేవ చేస్తుందనికానీ నేను కలలో కూడా అనుకోలేదు. అయితేనేం, నేనివాళ బ్రతికి బట్టకట్టడానికి, మనిషిగా తను చేయగలిగినంతగా అహరహమూ పాటుపడి— పంకజం ఒకవిధంగా నాయీ మరోజన్మకు కారకురాలయింది. నిజానికి పంకజం దగ్గర్నుంచి యింతటి యీ ఆదరణ నేను కోరుకుంది కాదు.

పార్వతీ! నిన్నుచూసిన మొదటి నిముషం ప్రపంచంలోని నిర్మలత్వమూ, అమాయకత్వమూ, అందమూ అంతా కలిసి ఒకే వ్యక్తిలో యెలా మూర్తీభవించాయా అని ఆశ్చర్యపోయాను. నీతోపరిచయం, స్నేహం పెరిగేకొలదీ మనిషిమీద, మానవతమీద చెదిరిపోని నా విశ్వాసానికి బలంపెరిగి నన్ను నేను నిలబెట్టుకొన్నాను. ఒకరిమీద మరొకరికి సానుభూతి, ఆదరణ, అనురాగం, ప్రేమా జనించాక, జీవితానికి ఒక గమ్యాన్ని మలుపుని నిర్ధారించుకొని భవిష్యత్‌లో కొంత సుఖమూ, ఆనందమూ, నీతోపాటు రానున్నాయని యెన్నో ఆశలతో కలలతో బ్రతుకు గడిపాను. మొత్తంమీద నీ ప్రవేశం నాజీవితంలో వెలుగువే నింపింది పార్వతీ! అందుకు కృతజ్ఞతగా నేనేం చేయను?—ఇవాళ నేను బందీని—పూర్తిగా అశక్తుణ్ణి' చలపతి ఆగాడు— మాటలు పెకలడం కష్టమైపోయింది.

పార్వతి కన్నీళ్ళు చెక్కిళ్ళ నునుపు మీదనుంచి క్రిందకు జారి గడ్డి పరకల్ని తడుపుతున్నాయి.

అప్రయత్నంగా ఆమె పెదవులు వణికాయి.

పెల్లుబుకుతున్న దుఃఖాన్ని పెదవి దాటనీయకుండా మునిపంటితో నొక్కిపట్టి అంతరంగంలోని సంచలనాన్ని అదుపులోకి తెచ్చుకొంటుంది.

ఆ నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ టవర్ క్లాక్ 'ఠంగ్'మని గంటకొట్టి వూరుకొంది.

సిమెంటు సోఫామీద ముసలివాడు కొద్దిగా కదిలి కాళ్ళు కడుపులోకి ముడుచుకొన్నాడు.

ముద్ద మందార చెట్టు తలూపడం మానుకొంది.

కుర్రాళ్ళిద్దరూ పుస్తకాలను తలగడలుగా పెట్టుకొని వెల్లకిలా పడుకొని కబుర్లు చెప్పుకొంటున్నారు.


మసకచీకటి పూర్తిగా తొలగిపోయి ఎలక్ట్రిక్ బల్బుకాంతిలో పువులు మిరుగుతున్నాయి.

పార్కు రేడియోలో మాటలు అంతేకాని పడిశం గొంతుల సంభాషణ—

చలపతి చిన్నగా దగ్గాడు—

'ఇవాళ నేనెలాంటి ధైర్యం చేసినా పంకజానికి కృతఘ్నుణ్ణిగా ప్రవర్తించడమే అవుతుంది పార్వతీ! ఒకేరక్తాన్ని పంచుకు పుట్టినతోబుట్టువుగా దానిమీద నాకెలాంటి ప్రేమా లేదు. అయినా కృతజ్ఞుణ్ణిగా ప్రవర్తించాల్సిన అగత్యంమాత్రం వుంది. మామయ్య తనకూతురితోపాటు నాకిచ్చే డబ్బును అంటే కట్నంపేరిట అమ్ముడుపోతున్నడబ్బును పంకజం పెళ్ళికి, పంకజం కూడా మరొక వ్యక్తిని కొనుక్కునేందుకు వినియోగించాలని అమ్మ, అన్నయ్య చేస్తున్న ప్రయత్నాలకు నేను తలొంచడం, 'ఊఁ...' అని అంగికారం తెల్పడం నేనున్నస్థితిలో తప్పని సరైంది.

నాకోసం, నా స్వార్థంకోసమే కాదు. యితరులకొరకు కూడా జీవితంలో యింతవరకూ నాకిష్టంకాని పనేదీ చెయ్యలేదు— ఒకరోజు నన్నిలా లొంగదీసుకొనేందుకు అన్నయ్య విశ్వప్రయత్నం చేసాడు. అమ్మ చెప్పి చెప్పి విసిగిపోయింది. సుశీలకు నేను అమ్ముడు పోనన్నాను, చివరకు యింటి నుండి బయటకు గెంటారు. ఆనాడు చిర్నవ్వుతోనే సహించాను — యీనాడూ అలాగే చిర్నవ్వుతో నిన్ను, నా జీవితానికి



వెలుగుని పొందులుకొంటున్నాను. వింటు కంటావేమో నా సమాధానం ఒక్కటే— మనిషిగా బ్రతికేందుకు యీ నిర్ణయం తీసుకొన్నాను. మనిషిగా పుట్టాక మనిషిగా జీవించడం ఒక్కటే నా ఆశయం.'

చలపతి ముఖంలో రంగులు మారాయి.

దృష్టి తీక్షణంగా పరిసరాల్లోకి చొచ్చుకు పోతుంది.

చేతివేళ్ళు మెలిపెట్టుకొంటూ మౌనంగా వుండిపోయాడు చాలాసేపు.

భావరహితంగా శూన్యంలోకి చూస్తూంది పార్వతి.

'నాకు తెలుసు, నా నిర్ణయం నీపట్ల యెంత కఠినమయిందో. అంతేకాదు, నేను అప్రయత్నంగా జారిపడ్డ పరిసరాల్లోని వ్యక్తులు యెంతటి స్వార్థపరులోకూడా నాకు తెలుసు. నీతో చెప్పిన ఏమాటా నేనింకా మరిచిపోలేదు అయినా నా నిర్ణయము సరైనదేనని నా మనసు చెబుతుంది. నిజాయితీగా బ్రతుకుదామనుకొన్న నా ఆశయాలకి యిది ఓటమికాదు, పిరికితనం అంతకంటే కాదు. అయితే నీపట్ల నేరం కాదా? కావొచ్చు, నేను కాదనను. నాకో నమ్మకం వుంది. నీ మంచితనం నా నేరాన్ని క్షమించగలదని, మనిద్దరి స్నేహం క్షమా దృష్టి కలిగినదని, అయినా ఆఖరుసారిగా నిన్ను క్షమాభిక్ష యాచిస్తున్నాను పార్వతీ! నన్ను మనస్ఫూర్తిగా మన్నించు...'

# గాజు కళ్ళు

రెండు చేతుల్తోనూ ముఖాన్ని కప్పుకొన్నాడు చలపతి.

గట్టిగా నిట్టూర్చి, అయోమయంగా, నిశ్శబ్దంగా నవ్వుకొంది పార్వతి.

రెండు నిముషాల తరువాత చలపతి హఠాత్తుగా ముందుకు వంగి పార్వతి కన్నీళ్ళని చేతివేళ్ళతో తుడిచాడు. అతని చేతివేళ్లని ఆఖరుసారిగా స్పృశించింది పార్వతి.

ఆ క్షణం యెంత నిగ్రహించుకొన్నా ప్రయోజనం లేకపోయింది—చలపతి కళ్ళు నిర్దయగా చెమర్చాయి.

* * *

'ఇలా జరుగుతుందనుకోలేదు' అన్నాడు భానుమూర్తి, గదిలో అడుగు పెడుతూనే. కిటికీలోనుంచి సాయం సంధ్యని చూస్తూ కూర్చున్న చలపతి వెనక్కుతిరిగి,

'ఏమిటి !?...' అన్నాడు.

'ఈ మనుష్యులకి మనసులు లేవు, వెళ్ళకన్నా జంతువులు నయం—'

'సరిగా చెప్పు భానూ...!'

'పెళ్ళికొడుకు...'

'ఊఁ...'

'పార్వతి ప్రక్కన నిలబడటానికి కూడా అర్హుడుకాదు.'

చలపతి మనసు నొచ్చుకుంది. క్షణకాలం ముఖంలో రంగులు మారాయి.

కిటికీదగ్గర్నుండి లేచి భానుమూర్తికి దగ్గరగా వచ్చాడు.

'అలా అనకు భానూ! మనిషి అందంగా వుండకపోవడం అతని నేరంకాదు అందం ఒక్కటే జీవితాన్ని సుఖవంతం చేయదు. మనిషికి మనసు ప్రధానం.'

భానుమూర్తి నిట్టూర్చి కుర్చీలో కూలబడ్డాడు.


జేబులోనుంచి సిగరెట్ పెట్టె తీసి సిగరెట్ వెలిగించి గట్టిగా ఒక దమ్ములాగి,

'పెళ్ళిపందిరి, రకరకాల మనుష్యులు వాళ్ళ మనస్తత్వాలు—ఇవాళ నా మనసేం బాగాలేదు చలపతీ! మెడలో తాళి కడుతున్నపుడు పార్వతి కళ్ళమ్మట నీళ్ళు తిరిగాయి. ఎవరు చూసారు? ఒక్కరన్నా చాటుగా కళ్ళొత్తుకోవడం నేను చూసాన. వీళ్ళే మనుష్యులు చెప్పు? కనీసం తాళి కడుతున్న భర్తయినా ఆమె ముఖంలోకి ఒక నిముషం నిదానంగా చూసాడా? వంద సంవత్సరాల జీవితానికి కట్నండబ్బు ఒక్కటే నా విలువ? పందిరినిండా అంతమంది మనుష్యులు, బాజాలు, భజంత్రీలు — పురోహితుడు, మంత్రాలు జరిపించేసాడు. పెళ్ళి ఈ ఇరవైయవ శతాబ్దంలో కూడా యిష్టంలేని పెళ్ళిని బలవంతాన స్త్రీ ముఖాన రుద్ది పెత్తనం చెలాయిస్తూ సంతోషంగా దీవిస్తున్నారంటే వీళ్ళేం మనుష్యులు ఎప్పటికి యీ మనుష్యులు మారేది?' చివరి మాటల్లో భానుమూర్తి కంఠంలో ఆవేశం, బాధ, ధ్వనించాయి.

చలపతి అలాగే నిలబడి పోయాడు. అతని మస్తిష్కంలో ఆలోచనలు సుళ్ళు తిరుగుతున్నాయి. అంతకు ముందున్న ప్రశాంతత అంతా భానుమూర్తి మాటలతో చెల్లాచెదరయింది

మళ్ళీ భానుమూర్తే అన్నాడు.

'నువ్వు లక్షమాటలు చెప్పు చలపతీ! నువ్వు చేసింది అక్షరాలా తప్పంటాను. ఎదుటి వ్యక్తులనుంచి తనకోసం సుఖం కొంత నష్టపోయినా పరవాలేదుకాని వాళ్ళ స్వార్థానికి తలొంచడం మంచిది కాదు. పంకజానికీ, మీ కుటుంబానికి నువ్వెంత కృతజ్ఞుడవో పార్వతి జీవితానికి కూడా అంతే బాధ్యుడివి. పార్వతి కన్నీళ్ళతో నీ మానసిక ఔన్నత్యం, మానవతావాదం సమూలంగా తుడిచిపెట్టుకుపోయి వట్టి



[illegible]—యిది నిన్ను బాధపెట్టేమాటే అయినా అనక తప్పదు—'

'చక్కగా చెప్పావు భానూ! నువ్వన్న దాంట్లో కొంత నిజాన్ని నేనూ అంగీకరిస్తున్నాను' ప్రయత్న పూర్వకంగా చిన్న మందహాసం చేసాడు చలపతి.

సిగరెట్ ముక్కని విసరివేస్తూ—

'ఇంకొకమాట! మన ఆశలు, ఆశయాలు యితరులకు కష్టాన్ని, నష్టాన్ని కలిగించకుండా వుండాలంటే జీవితంలో మనమేమీ చెయ్యలేము. ఒక్కటిమాత్రం చెయ్యగలం. ఆలోచనల్లో ఉన్నతంగానూ, ఆచరణలో అల్పంగానూ బ్రతగ్గలం—యిది సత్యం—వింటుకంటే, ఇంతకీ ఏ ప్రవర్తన ఎదుటి మరోవ్యక్తిని బాధపెడుతుందని మార్చుకొన్నావనుకో రేపు యింకొక వ్యక్తికి నీముఖం చూస్తేనే బాధకలవచ్చు—అప్పుడేమిటి చెయ్యడం?' చలపతి ముఖంవైపు ప్రశ్నార్థకంగా చూస్తూ ఉండిపోయాడు భానుమూర్తి.

చలపతి దగ్గర్నుంచి యెలాంటి సమాధానం రాలేదు

అతని ముఖంలోని గంభీరంనుచూసి, యిహ లాభంలేదని తేల్చుకొని మంచం వైపు నడిచాడు భానుమూర్తి.

రెండు నిముషాల తర్వాత శరీరానికి నిండుగా దుప్పటిలాక్కుని కళ్ళు మూసుకొన్నాడు.

చలపతికి యెంతోమంది స్నేహితుల, అప్తుల రూపంలో నున్న ఒకేఒక ప్రాణ స్నేహితుడు భానుమూర్తి.

హైస్కూలులో చదువునుండీ కాలేజీ వరకు కలసి చదువుకొని, ఒకే కంచంలో కాకపోయినా కలసితిని, కలిసి పడుకొని అతి సన్నిహితంగా, ఒకరిదగ్గర మరొకరికి ఏరహస్యమూ లేకుండా బ్రతికినవాళ్ళు.

ఒకేగదిలో నిన్న మొన్నటివరకూ జీవితం గడిపిన వాళ్ళు.

చలపతి జీవితంలోని ప్రతిమలుపూ, ప్రతిపేజీ క్షుణ్ణంగా తెలిసినవాడు భానుమూర్తి.

స్నేహితుడిగా తనకుజరిగిన నష్టానికి అతను పడుతున్నబాధ అర్థమవుతూనే వుంది చలపతికి.

మంచంమీది భానుమూర్తిని చాలాసేపు ఆప్యాయంగా చూస్తూ వుండిపోయిన తరువాత కిటికీవైపు నడిచాడు చలపతి.

నక్షత్రాలులేని నల్లటి ఆకాశం, జుట్టు విరబోసుకొని భయపెడుతున్న చీకటి, చీకటికి జడిసి కొంచెంగా తలూపుతున్న యెదురింటి వేపచెట్టు, దృష్టి యింకా ముందుకు సారిస్తే యిళ్ళకీ, చెట్లకీ భేదం కనబడటంలేదు. కొండలబారుల్లా, గుడిగోపురాల్లా అస్పష్టమైన ఆకారాలు మత్తుగా, స్తబ్దుగా చీకటిలో కలసి నిద్రపోతున్నట్లున్నాయి.

ఏ ఆలోచనా స్థిరంగా ఓ నిముషం బుర్రలో నిలబడటంలేదు చలపతికి—

ఆలోచన అనేది లేకుండా బ్రతగ్గలిగితే, పరిస్థితులమీద నియంతృత్వం చెలాయించి అజ్ఞానంలోనయినా మనిషి సుఖంగా బ్రతుకుతాడేమో!

అయితే యిప్పుడు అదీ ఒక ఆలోచనే!

తనమీద తనకే విసుగుపుట్టింది చలపతికి—

కిటికీ చువ్వలమధ్య తల యిరికించి నొక్కుకొన్నాడు

కాసేపు అరచేత్తో నుదుటిమీద బలంగా కొట్టుకొన్నాడు.

ఆ అస్తవ్యస్తపు స్థితిలో నుంచి క్రమంగా అతనికి గతం జ్ఞాపకం వచ్చింది.

సంవత్సరం క్రితం, ఆరోజు దృశ్యంలా కదలాడింది మనసులో

కేశవరావు ఆఫీసునుంచి ఇంటిగుమ్మంలో అడుగు పెడుతూనే.

'నాయకత్వాలు, సంస్కారాలు కడుపుకి తిండిని పెట్టవు' అన్నాడు.

ముందుగదిలో కిటికీచువ్వలమీద అద్దాన్ని జాగర్తగా నిలబెట్టి తల దువ్వుకొంటున్న చలపతి ఆ మాటకు వెనక్కు తిరిగిచూసాడు.


కేశవరావు చలపతికంటే రెండు మూడేళ్ళు పెద్ద. అయినా చలపతికి అతన్ని 'అన్నయ్యా' అని పిలిచి యెరుగడు. పేరునకానీ, 'అరే' అని కానీ పిలిచే అలవాటు. బాల్యంనుండీ కలసి తిరిగిన స్నేహం చనువూ అందుక్కారణం.

కేశవరావు ముఖంలోని చిరాకునీ, అసహనాన్ని చూసి మళ్ళీ మామూలుగా తల దువ్వుకోవడంలో నిమగ్నుడయాడు చలపతి. పైగా కేశవరావు నోటనుమాట ఆమాటలు వినడం అతనికి క్రొత్తకాదు కడుపుకి తిండిని పెట్టే దేమిటో అతనికి తెలిసి సాకగా మరెప్పటికీ తెలియదనికూడా చలపతి నమ్మకం.

'నిన్నే! ఏమిటి ఆఫీసు అంతా గొడవలతో ముంచెత్తుతున్నావట?' దగ్గరగా వచ్చి రెట్టించాడు కేశవరావు.

ఈసారి సమాధానం చెప్పడం తప్పనిసరైంది చలపతికి—

'ఏముంది, మామూలే లేడీటైపిస్టుని. రాత్రికి యింటికి రమ్మన్నాడట మేనేజరు. అర్జంటు కాయితాలు ఇంట్లో వున్నాయట. కాస్తగట్టిగా హెచ్చరించాను మేనేజర్ని, అంతే!'



'నీకూ, ఆ లేడీ టైపిస్టుకి ఏమిటీ పరిచయం? నీకేమిటి సంబంధం యీ విషయంలో?' కేశవరావా గొంతులోని వ్యంగానికి నిముషంసేపు నిరుత్తరుడైయాడు చలపతి.

'మాట్లాడవేం? చెప్పకూడవిదా?' కేశవరావు నిలదీసాడు—

'మనిషికీ మనిషికీ మధ్య మానవత్వం అనే సంబంధం ఒకటుంటుంది నీ కర్థం కాసిది. అదే...' సాధ్యమయినంత సౌమ్యంగా చెప్పాడు చలపతి.

'మనిషి' అంటే యీరోజుల్లో అర్థమేమిటో తెలుసా? నాలుగురాళ్ళు సంపాదించి, గౌరవంగా బ్రతకనేర్చినవాడు మనిషి'

కేశవరావు గొంతులోని యీసడింపుకి చలపతిలోని సహనం పూర్తిగా చచ్చిపోయింది.

'అవును, కామెర్లరోగికి లోకమంతా పచ్చగానే కనిపిస్తుందట' కటువుగా జవాబు చెప్పాడు.

కేశవరావు జీవితాశయాల్లో మొదటిది, నాలుగురాళ్ళు గడించటం, రెండవది బ్రతకనేర్చడం. ఈ రెండింటి ఆచరణలో మరేయితర ఆలోచనల్ని అతను ఖాతరు చెయ్యడు. టేబుల్ క్రింద చెయ్యిచాచడంలో కూడా నీతిని జొప్పించగల సామర్థ్యం అతనికుందని చలపతికి తెలుసు.

చేతిలో డబ్బుంటే కొండమీది కోతయినా దిగివస్తుందని కేశవరావు వాదిస్తుంటాడు.

నిజంగా కొండమీదనుంచి కోతే దిగివస్తే మనిషికి యెంతఉపయోగమో అవసరాలకు మించివున్న డబ్బుకూడా అంతే ఉపయోగం చలపతి దృష్టిలో.

అయితే అవసరాలకుకూడా వేర్వేరు దృష్టులుంటాయి.

కేశవరావు దృష్టివేరు—

అతని అవసరాలు కృష్ణతులాభారాన్ని గుర్తుకు తెస్తాయి: కృష్ణుడంత బరువయిన అవసరాలు, కోర్కెలు అతనివి. చలపతి వాడిన కఠినమయిన ఉపమానానికి కేశవరావు ముఖం కోపంతో యెరుపెక్కింది.

'రేపునువ్వు మానేజర్‌కి క్షమాపణలు చెప్పుకోవాలి' గద్దించినట్టుంది గొంతు.

'ఎందుకూ ?'

'నిన్నాళ వాగిన వాగుడికి —'

'నేనేం తప్పుగా మాట్లాడలేదు క్షమాపణలు చెప్పుకోవాల్సిన అవసరం నాకేం లేదు'

# గాజుకళ్ళు

'పోనీ బ్రతకవలసిన అవసరం అయినా వుందా ?'

'అంటే ?...'

'ఏంలేదు; బ్రతకడానికి ఉద్యోగం అంటూ చెయ్యక తప్పదు, ఉద్యోగం వూడిపోకుండా వుండాలనుంటే ఆయన్ను క్షమాపణ కోరుకోక తప్పదు.'

'నేనా ఉద్యోగాన్ని మానుకొనన్నా మానుకొంటాను కానీ, అపాలజీమాత్రం కోరుకోను'

కుండ బద్దలు కొట్టినట్టు తన నిర్ణయాన్ని తెలియపరిచాడు చలపతి.

కేశవరావు కనుబొమల్ని చిత్రంగా యెగరవేసి,

'ఉద్యోగానికి రిజైనిచ్చి ?'

'మరెక్కడయినా...'

'ఎప్పటికి ?'

'ఇప్పుడెలా చెప్పగలను ?...'

'అప్పటివరకూ నీ వ్యక్తిత్వాన్ని, ఆత్మాభిమానాన్ని, ఆదర్శాల్ని జాగర్తగా కాపాడుతూ యింట్లోకూర్చోబెట్టి ముప్పూటా నీ శరీరాన్ని మేపడానికి యిక్కడెవరూ సిద్ధంగాలేరు అర్థమయిందా ?... యిహ నీ యిష్టం' నిష్కర్షగా ముఖానచెప్పి విసురుగా లోనకు వెళ్ళిపోయాడు కేశవరావు.

చలపతి నిర్విణ్ణుడై నిలబడిపోయాడు.

లోపల యింకా పొగరేగుతూనే వుంది. భార్యకీ, పంకజానికీ, తల్లికీ చెబుతూ పెద్దగా కేకలు వేస్తున్నాడు కేశవరావు.

'పొరపాటుగా మాట్లాడానని ఒక్కమాట చెప్పడానికి యేంరోషం ?...' పంకజం వ్యాఖ్యానిస్తుంది.

'వాడిబుద్ధి ఆ భగవంతుడు ఎప్పుడు మారుస్తాడో...' అంటుంది తల్లి.

చలపతికి ఆ స్థితిలోకూడా నవ్వొచ్చింది —లంచం పెట్టకుండా భగవంతుణ్ణి ఒక్కసారయినా కోరుకొన్నందుకు ఎందుకంటే లంచంలేందే ఆ యింట్లో దేముడు వుండడు.

చలపతి ఆలోచనలు ఒకటొకటిగా ముందుకు సాగాయి—

ఉద్యోగం, సంపాదన, డబ్బుతో మింగుడుపడే సుఖాలు, నాగరికత, పెదవుల పైపైన ఆప్యాయత, అంతరంగాలకు మరీ ఔన్నత్యాలు తెలియకపోవడం, అన్నీ తెలుసుననే అజ్ఞానం, అహంకారం, మేకపోతు గాంభీర్యం, కాలాన్ని మూర్ఖంగా నెట్టుకుపోవడం, మధ్యలో వొకొణ్ణొకరు వంచించుకోవడాలు, కాటు వేసుకుంటూ పొందే తృప్తి — యిదేజీవితం?

కుంచితమయిన స్వభావాలు, సంఘాలు, యిరుకుసందులు, గాలి ఆరోగ్యంగా వుండదు, వెలుతురు నిజమయిందికాదు, కృత్రిమ ఆలోచనలు, జిజ్ఞాసలు, గొప్పలుకోసం ప్రాకులాట, పరుగు, పందెం యిదే జీవితపు విలువలు?

కాకపోతే ముందుతరాల వారిమీద యీ అజ్ఞానపు అంధకార జీవితం తాలూకు నీడలు వారసత్వంగా — ప్రయత్నించి పడేటట్టు చూడటం, యీమురికి గుంటలలోనుంచే ఏదో సువాసనవుందని మోసంతో కూడిన సందేశం, శాసనాల్లాంటి నాలుగు వాక్యాలు, భవిష్యత్ తరంమీద ఉక్కుపిడికిలితో బలమైన గుద్దులు—

ఈ ప్రభావాల్ని మూర్తీభవింప చేసుకొన్న కేశవరావు, అతన్ని అనుసరించి అచ్చుప్రతిగా తయారయిన పంకజం, ఆత్మవిశ్వాసం కోల్పోయి భగవంతుడితో బేరాలాడే తల్లి, యిప్పుడిప్పుడే పరిసరాల్లోకి జారుతున్న వదిన వేళ్లను తను మార్చలేడుకదా. తనుకూడా ఆగుంటలో కూరుకుపోయే ప్రమాదంవుంది.

చీదరవేసింది చలపతికి, యింక ఆలోచించలేక పోయాడు.

సూట్‌కేస్‌లో రెండుజతలు బట్టలు సర్దుకొని యింటిగుమ్మం దిగాడు.

వీధి గుమ్మంమెట్లు దిగుతుంటే తల్లినుద్దేశించి పంకజం అంటున్న రెండు ముక్కలు వినిపించాయి.

'ఎందుకే బాధపడతావ్? యెక్కడ బ్రతుకుతాడో తెలుస్తుంది, వెళ్ళనీ...'

చలపతి వెనక్కుకూడా తిరిగిచూళ్ళేడు.

అంతే ఆరోజుతో అవ్యక్తులతో, పరిసరాలతో పూర్తిగా సంబంధాలు త్రెంచుకొన్నాడు

ఆదృశ్యం తరువాత సంవత్సరం జీవితాన్ని క్రమంగా మననం చేసుకొన్నాడు

చలపతి.

ఆరోజు సరాసరి గుంటూరు బస్సెక్కి భానుమూర్తిగదికి రావడం, స్నేహితుడిగా భానుమూర్తి చూపించిన మరువలేని ఆదరణ, సన్నగా, యెర్రగా, అమాయకంగా వున్న పార్వతితో పరిచయం, పరిచయం పరిచయం మంచిస్నేహం అవ్వాయతా మనసులు కలసి, మమతలుపెరిగి ఆనందంగా, ఉత్సాహంగా దొర్లినకాలం.

స్వచ్ఛంగా, నిర్మలంగా, సంతోషంగా గడుస్తున్న జీవితంలో వున్నట్లుండి పెద్ద మార్పు

నెల్రకితం హఠాత్తుగా ముట్టడించిన జ్వరం, వారంరోజులవరకూ తగ్గకపోగా డక్టర్ 'టైఫాయిడ్' అని చెప్పడంతో భానుమూర్తి గాభరాపడిపోయి తనకు తెలియకుండా యింటికి కబురుచేయడం, తను స్పృహ కోల్పోయినపుడు కేశవరావు వచ్చి యింటికి తీసుకెళ్లడం, యీ నెల్లాళ్లు పంకజం శుశ్రూష, అన్నయ్య చూపించిన అకారణప్రేమ, అమ్మకు తనే ప్రాణం అయిపోయి ఆమె తన మంచంవద్దే కంటికి వత్తులు వేసుకొని కూర్చోవడం, కేశవరావు వందలు ఖర్చుపెట్టినట్లు చెప్పిన లెఖ్ఖ, మామయ్య, సుశీల, దగ్గరి బంధువులు— అంతా గందరగోళం—

ఆలోచనల్లోనుంచి చలపతి ఉలిక్కిపడ్డాడు.

కిటికీలోనుంచి వర్షపుజల్లు అతని ముఖంమీద కొట్టింది.

వర్తమానంలోకి వచ్చిపడ్డాడు.

యీదురుగాలికి కిటికీరెక్కలు తలలను గోడకేసి కొట్టుకొంటున్నాయి.

వర్షం పెద్దదైంది—

చీకటి చిక్కనైంది—

ఆకాశం స్పష్టంగా కనిపించడంలేదు వానచినుకుల్లో.

ఎదురింటి వేపచెట్టు కొమ్మలు విరిగి క్రిందపడేలా వున్నాయి

కిటికీరెక్కలు మూసివేసి, గడియపెట్టి మంచంమీద వాలాడు చలపతి.

ఇంటికప్పుకేసి చూస్తూవుంటే యెప్పటికో అతనికి తెలియకుండానే నిద్రపట్టింది.

* * *

'ఇలా జరుగుతుం దనుకోలేదు.'

వీధిగుమ్మంలో అడుగుపెట్టిన చలపతి తక్కున అక్కడే ఆగిపోయాడు.

లోపలి గదిలోనుంచి వినిపించిన గొంతు కేశవరావుది.

'ఇప్పటికయినా వాడేదో బాగుపడతాడనుకొన్నాను' అన్నాడు మళ్ళీ.

'ఏమిటి నువ్వనేది ?' కొడుకుచెబుతున్న విషయం సరిగ్గా అర్థంకాలేదు జానకమ్మకు.

'మధ్యాహ్నం మామయ్య ఆఫీసు కొచ్చాడు— ఆయన నిన్న గుంటూరు వెళ్ళాట్ట'

'ఊఁ...'

'చలపతి పాతరూమ్‌కి వెళ్ళాడట, అక్కడే వున్నాడుగదా పలకరిద్దామని'

'వీడున్నా డటనా ?'

'లేదు, అసలు విషయం ఏమిటంటే వాడక్కడ ఓ అమ్మాయితో సంబంధ ముందని చెప్పకొచ్చాడు మామయ్య...'

జానకమ్మ తెల్లబోయినట్లుంది—యేం మాట్లాడలేదు.

'ఎలా తెలుసుకొన్నాడట ఆయన ?' పంకజం ప్రశ్న.

'ఒకళ్లిద్దరు కాదు, తనవెరిగిన ప్రతి ముఖమూ చెప్తుంది అన్నాడు' పంకజానికి జవాబుచెప్పి నిముషం తరువాత చెప్పకుపోతున్నాడు కేశవరావు.

'ఆయన చాలా బాధపడ్డాడు, వాణ్ణలా వదిలేసి వూరుకొంటేనే బాగుండేది — మళ్ళీ యింటికి తీసుకొచ్చి రోగం నయం చేపించి దేశంమీదికి వదలడం మనదే పొరపాటన్నాడు. పైగా వాడి రూమ్మేటు చాలా అవమానకరంగా మాట్లాడాడట' మా చలపతి తప్ప యింతదేశంలో మీ అమ్మాయికి యిన్నాళ్లనుంచి బేరమే కుదరలేదా ?' అని అడిగేశాడట. మామయ్య చాలా నిష్కర్షగా చెప్పాడు. అంతా మనమేదని పులుముకోవడం నాదే బుద్ధితక్కువ, యిహ బుద్ధొచ్చింది. ఆ దౌర్భాగ్యుడి యిహ నా కూతురిని యివ్వడం కూడానా ?' అని ముఖాన అనేసాడు. ఒక్కగా నొక్కకూతురు నా ఆస్తి అంతా ముందుగానే దానిపేర్న రాసి అయినా బంగారంలాంటి సంబంధం నిముషంలో కుదుర్చుకొంటాను అన్నాడు.'

కేశవరావు చెప్పడం పూర్తయాక రెండు నిముషాల వరకూ యెవ్వరూ మాట్లాడలేదు.

తరువాత జానకమ్మ పొడిదగ్గుతో గొంతు సరిచేసుకొంటూ, దుఃఖాన్ని చీదుతూ —

'ఇంతకూ మన అదృష్టం బాగాలేదు లేరా కేశవులూ ! ఆ ఆస్తి మనకు దక్కేదయితే ఆనాడు మాటపట్టింపులు వచ్చేవే కావు. నువ్వు బయటిపిల్లను చేసుకొనేవాడివికావు అంతా ఖర్మ ! ఆయన అన్నాడంటే అనడూ. పదిరోజుల్రకిందట వాణ్ణి చూడటానికి వచ్చినపుడుకూడా ప్రత్యేకించి మరీ చెప్పాను—వాడిదివరకి చలపతి కాడన్నయ్యా, మారిపోయాడు.సుశీల అదృష్టం మంచిదీ అని...'

పంకజం మధ్యలోనే త్రుంచేసి అందుకొంది —

'అవును, అర్థమవుతూనే వుందిగా సుశీల అదృష్టం యెంతమంచిదో' దీర్ఘం తీసి,

'వాడికి హృదయంలేదు, మమతలులేవు వళ్ళంతావిషం. రాత్రింబవళ్లూ కంటికి రెప్పలా చూసుకొంది పాముకి విషంపోసినట్లయింది ఇవాళ మామయ్యకి మాత్రమే తెలిసింది, రేపు నలుగురికీ తెలిస్తే ఏమవుతుంది కుటుంబమర్యాద...' సన్నగా ఏడుపు మిళితం చేస్తుంటే,

'ఊరుకోవె పంకజం ! ఏమనుకొంటే యేంలాభం ?...' అంది జానకమ్మ కూతుర్ని సముదాయిస్తూ.

'చూడు పంకజం ! వాడిబట్టలూ అవీ ఒకసంచిలో సర్దివుంచు రాగానే దొయిస్తూ చేతికిచ్చి ఓ నమస్కారం చేదాం.' ఇహ ఆ దౌర్భాగ్యుడు క్షణంకూడా యీకొంపలో వద్దు' లన్నాడు కేశవరావు

'అలాగే అన్నయ్యా !' అంటూంది పంకజం.

చలపతి యిహ అక్కడ నిలవలేక పోయాడు. వెనక్కుతిరిగాడు.

వీధిగుమ్మం మెట్లు దిగుతూంటే వెనకనుంచి యింకా పంకజం దీవెనలు వినబడుతూనే వున్నాయి.

కడుపులో చేతులు పెట్టి దేవుతున్నట్లనిపించింది చలపతికి.

రోడ్డెక్కాక తేలిగ్గా శ్వాస పీల్చుకొన్నాడు. తలెత్తి పైకి చూస్తే.

ఉదయపు ఆకాశం నిర్మలంగా, స్వచ్ఛంగా వుంది.